సాక్షి ఆదిలాబాద్

సోమవారం, 6, మే, 2024



సామూహిక వివాహాలు ఆదర్శనీయం

ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్‌లోని పూలాజీబాబా ధ్యాన్ కేంద్రంలో సామూహిక వివాహ వేడుకలు నిర్వహించారు. IIలో▸



నర్సింహరెడ్డిదే అధిక మెజార్టీ

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 18సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్(ఐ) అభ్యర్థి నర్సింహరెడ్డి సాధించిన మెజార్టీయే అత్యధికం. IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.0/28.0

ఉదయం నుంచే ఎండతీవ్రత కొనసాగనుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి.

వరాల.. జాతర



వేదికపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులు



హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

- కాంగ్రెస్ 'జనజాతర' విజయవంతం
- రాహుల్‌గాంధీ సభకు భారీగా జనం
- ఉమ్మడి జిల్లాను దత్తత తీసుకుంటాం
- సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- తుమ్మిడిహెట్టి, సీసీఐలపైనా హామీ
- బీజేపీపై విరుచుకుపడిన నాయకులు

నిర్మల్/నిర్మల్‌చైన్‌గేట్: తనకు ఆదిలాబాద్ అంటే ఎంత ఇష్టమో మీకు తెలుసని, తాను పీసీసీ అధ్యక్షుడైన తర్వాత మొదటి కార్యక్రమమే నిర్మల్‌లో చేపట్టానని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. నిర్మల్‌లోని కలెక్టరేట్‌రోడ్డులోని క్రషర్‌గ్రౌండ్‌లో ఆదివారం జన జాతర పేరిట కాంగ్రెస్ నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సభలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతోపాటు సీఎం పాల్గొన్నారు. ఇద్దరు నేతలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వరాలు కురిపించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఆదిలాబాద్ అంటే ఎంత ఇష్టమో అందరికీ తెలుసని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడైన వెంటనే నిర్మల్‌లో మోదీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలపై తొలిసారి పోరాడానని గుర్తుచేశారు. ఇంద్రవెల్లిలోనూ కేసీఆర్ సర్కారుకు వ్యతిరేకంగా దళిత, గిరిజన దండోరా నిర్వహించి బీఆర్‌ఎస్‌పై సమర శంఖం ఊదామని పేర్కొన్నారు.

దత్తత తీసుకుని అభివృద్ధి

ఉమ్మడి ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేసే బాధ్యత సీఎంగా తాను తీసుకుంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి 1.50లక్షల ఎకరాలకు నీరిస్తామని వాగ్దానం చేశారు. ఆదిలాబాద్‌లో మూతపడిన సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని మళ్లీ తెరిపించే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని చెప్పారు. తాము పదేళ్ల అధికారంలో ఉంటామని, ఆదిలాబాద్‌ను సస్యశ్యామలం చేసి ఇక్కడి రైతులను ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.



వేదికపైకి వస్తూ... అభివాదం

తొలిసారి ఆడబిడ్డకు..

గత 70ఏళ్లలో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఏ ఒక్క మహిళకు అవకాశం రాలేదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోనియాగాంధీ ఎట్టి పరిస్థితుల్లో ఆదిలాబాద్ నుంచి గోండు ఆడబిడ్డ ఆత్రం సుగుణను పార్లమెంట్‌కు తీసుకెళ్లాలని టికెట్ ఇచ్చారని చెప్పారు. తమ అభ్యర్థి సుగుణ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వదిలి తండాలు, గూడేల్లో తిరుగుతూ ప్రజాపోరాటాలు చేశారని గుర్తు చేశారు. ప్రజాసమస్యలు తెలిసిన సుగుణను లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. కుమురంభీం, రాంజీగోండు స్ఫూర్తితో ముందుకు సాగుతున్న ఆమెను పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం సాక్షిగా ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతానని హామీ ఇచ్చారు.

రాహుల్‌ను ప్రధానిని చేద్దాం



రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి మనమంతు కృషిచేద్దాం. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని తొలగించి మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని అనుకుంటోంది. అందరి హక్కులు కాపాడేది రాజ్యాంగమే. బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపించమంటే అయోధ్య నిర్మాణాన్ని చూపిస్తోంది. ఎందరో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన రాహుల్‌గాంధీకే సొంత ఇల్లు లేదు. ఇలా పేదలకు దగ్గరగా ఉండే నాయకుడినే గెలిపిద్దాం. – సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

కొంగుచాచి అడుగుతున్న..



దేశ భవిష్యత్ కోసం కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. కొంగు చాచి అడుగుతున్న. నాకు ఓటేసి గెలిపించాలని కోరుతున్న. ప్రతీఒక్కరు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలి. రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దాం. ఒక గిరిజన బిడ్డను గుర్తించి కాంగ్రెస్ అధినాయకత్వం పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. జీవితంలో కాంగ్రెస్‌ను మరిచిపోలేను. కాంగ్రెస్ కుటుంబాన్ని బలోపేతం చేయడానికి కష్టపడి పని చేస్తా.

– ఆత్రం సుగుణ, ఎంపీ అభ్యర్థి

పదేళ్ల అభివృద్ధి ఏది?



కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పదేళ్లు పాలించి రాష్ట్రానికి, దేశానికి చేసిన అభివృద్ధి ఏమీలేదు. పదేళ్లముందు కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేసింది. ఆరోగ్యశ్రీ, 104, 108 సేవలు, రైతు రుణమాఫీ భూదాన్ లాంటి కార్యక్రమాలు తీసుకు వచ్చింది. ఇప్పటిదాకా ఐదెకరాలలోపు ఉన్న రైతులందరికీ రైతుభరోసా ఇచ్చాం. కేసీఆర్ ఖజానా ఖాళీ చేయడంతోనే పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోయాం. ఆగస్టు 15లోపు రైతుల పంటరుణాలు మాఫీ చేస్తాం.

– వెడ్మ బొజ్జుపటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే

సాగు భారమవుతోంది



బీజేపీ ప్రభుత్వంలో డీజిల్, పెట్రోల్, ఎరువులు, విత్తనాల ధరలు పెరగడంతో వ్యవసాయం భారంగా మారింది. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకు అటవీ భూములు ఇవ్వడానికి సిద్ధపడింది. నూటికి 95మంది రైతులు అప్పుల పాలయ్యారు. నేటికీ బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర చట్టం తీసుకురాలేకపోయింది. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. ప్రస్తుత ఎన్నికలు ఆత్మగౌరవాన్ని కాపాడుకునే ఎన్నికలు.

– ప్రొఫెసర్ కోదండరాం

బీజేపీకి మరో రూపమే బీఆర్‌ఎస్



బీజేపీకి మరోరూపమే బీఆర్‌ఎస్. కమలానికి మరోరూపమే కారుగుర్తు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసినా అది కారు గుర్తుకే వేసినట్లవుతుంది. ఈ సభ బీజేపీకి వణుకు పుట్టించేలా ఉంది. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేస్తానని మాట్లాడుతోంది. రాజ్యాంగాన్ని రద్దు చేస్తే బీజేపీని పాతళంలోకి తొక్కేస్తాం. ఎవరో చేసిన ఫేక్‌వీడియో ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని ఇబ్బందులకు గురి చేస్తోంది. అమిత్‌షా రేవంత్‌రెడ్డి వెంట్రుక కూడా పీకలేరు. కేంద్రంలో కాంగ్రెస్‌కు అధిక మెజారిటీ ఇచ్చి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేద్దాం.

– అద్దంకి దయాకర్



అభివాదం చేస్తున్న అమిత్‌షా, పక్కన ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు

కదనోత్సాహం

- బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన అమిత్ షా పర్యటన
- కాగజ్‌నగర్ వికాస్ సంకల్ప్ సభ విజయవంతం
- ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన జనం
- మార్మోగిన జైశ్రీరామ్, భారత్ మాతాకీ జై నినాదాలు



సభకు హాజరైన ప్రజలు

చింతలమానెపల్లి/కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన ఉమ్మడి జిల్లా కమల దళంలో ఉత్సాహం నింపింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు అమిత్ షా సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీంతో కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో ఆదివారం నిర్వహించిన వికాస్ సంకల్ప్ సభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, కార్యకర్తలు, నేతలు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు అమిత్‌షా వస్తారని ప్రకటించినా గంట ఆలస్యంగా సాయంత్రం 4 తర్వాత ఆయన సభావేదిక వద్దకు చేరుకున్నారు.

నేరుగా వేదికపైకి..

అమిత్ షా పర్యటన కోసం కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ శిశుమందిర్ విద్యాలయం ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు పట్టణానికి చేరుకున్న ఆయన నేరుగా రోడ్డు మార్గం ద్వారా ఎస్పీఎం క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సుమారు అరగంటపాటు ప్రసంగించారు. ముందుగా నాగోబాతోపాటు బాసర సరస్వతీ అమ్మవారికి నమస్కారం అంటూ ప్రసంగం ప్రారంభించారు. ఆదివాసీ వీరులు రాంజీగోండు, కుమురంభీం, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీతోపాటు బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్‌ను గుర్తు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని.. రూ.కోట్లు తరలిస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. ఎస్పీఎం మూతపడింది..' అంటూ కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీపై ఓ వైపు విమర్శలు చేస్తూనే.. కేంద్రం చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. మంచిర్యాల– వాంకిడి జాతీయ రహదారితోపాటు అనేక సంక్షేమ పథకాలు చేపట్టామని తెలిపారు. మంచిర్యాల – ఆదిలాబాద్ రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

మార్మోగిన నినాదాలు

అమిత్‌షా ప్రసంగిస్తున్న సమయంలో ప్రజలు, కార్యకర్తలు భారత్ మాతకీ జై.. జైశ్రీరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ప్రతిఒక్కరూ సంఘీభావం తెలపాలని అమిత్ షా కోరడంతో సభికులు కాషాయ కండువాలు ఊపుతూ ఉత్సాహం చూపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని రాహుల్‌బాబాగా సంబోధిస్తూ ప్రసంగం కొనసాగించారు. చలోక్తులతో ప్రజలను ఆకట్టుకున్నారు. కాగా.. సభలో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్‌కు మాట్లాడే అవకాశం రాలేదు. కేంద్ర హోంశాఖ మంత్రి ప్రసంగానికి ముందు నగేశ్ మాట్లాడతారని భావించగా.. వేదికపైకి వచ్చిన అమిత్‌షా నేరుగా ప్రసంగించడంతో గోడం నగేశ్‌కు అవకాశం లేకుండా పోయింది.

హాజరైన ఉమ్మడి జిల్లా ప్రముఖులు

సభకు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ శ్రేణులు తరలివచ్చాయి. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్ బాబు, పవార్ రామారావు పటేల్, పాయల శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్లు సత్యనారాయణగౌడ్, సుహాసినిరెడ్డి, కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు మర్చిపోయిన సీఎం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి మర్చిపోయారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. రుణమాఫీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నడు. ఆగస్టులో రుణమాఫీ చేస్తే బ్యాంకులు రుణాలు ఎలా ఇస్తాయి.. రైతులు పనులు ఎప్పుడు చేసుకోవాలి. ముఖ్యమంత్రి స్థాయి మరిచి గాడిద గుడ్డు అని వ్యాఖ్యానిస్తున్నారు. గాడిద గుడ్డు కోసం నిన్ను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారా..?

– పాయల్ శంకర్, ఎమ్మెల్యే ఆదిలాబాద్

అబద్ధాల పునాదులపై..



అమలు చేయలేని హామీలను ఇచ్చి అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. అక్రమాలపై సమాధానాలు ఇచ్చుకోలేని స్థితిలో ఉంది. రియల్ ఎస్టేట్‌లో వేల కోట్ల అక్రమాలపై సమాధానం ఇవ్వలేదు. కడుపు కట్టుకుంటే 40వేల కోట్ల రూపాయలు మిగులుతాయని ముఖ్యమంత్రి చెప్పడం కాంగ్రెస్ తీరును తెలియజేస్తోంది. కాంగ్రెస్ పాలన మొత్తం స్వార్థం, డబ్బులు సంపాదించడంతో నిండిపోయింది. మహిళలు, విద్యార్థులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలను పథకాల పేరుతో మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారు.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నిర్మల్ ఎమ్మెల్యే

కాంగ్రెస్‌కు ఓటేస్తే దండగ



వంద రోజుల పాలనలో కేంద్ర ప్రభుత్వం ద్వారా సిర్పూర్ నియోజకవర్గానికి రూ.100 కోట్లు మంజూరు చేయించుకున్నాం. ఈ నిధులతో కాగజ్‌నగర్ రైల్వే ఓవర్ వంతెన నిర్మాణం, అండర్ పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నాం. కాగజ్‌నగర్ నుంచి చింతగూడ, ఈస్‌గాం గ్రామాల వరకు ప్రజలకు ఈ అభివృద్ధి పనులు ఉపయోగపడతాయి. బీజేపీ ఆదిలాబాద్ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపిస్తే మిగిలిన పదవీకాలంలో రోజుకు రూ.కోటి చొప్పున రూ.1800 కోట్ల నిధులతో అభివృద్ధి చేయిస్తాం. ఎకరాకు రూ.5వేల రైతు బంధు అమలు చేయడానికి కాంగ్రెస్‌కు ఐదు నెలల సమయం పట్టింది. రుణమాఫీ చేయాలంటే కాంగ్రెస్‌కు సాధ్యం కాదు. కాంగ్రెస్‌కు ఓటు వేయడం దండుగ.. పెద్దన్న లాంటి బీజేపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలి.– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

మోదీకి బహుమతిగా ఇవ్వాలి



గోడం నగేశ్‌ను బీజేపీ ఎంపీగా గెలిపించి నరేంద్ర మోదీకి బహుమతిగా ఇవ్వాలి. ఇక్కడి ప్రజలు బీజేపీ చేస్తున్న అభివృద్ధిని గుర్తించాలి. కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా ఉంది. జిల్లాకు ఇప్పటివరకు ఒక మంత్రి లేడు. విద్యాశాఖ మంత్రి, హోంశాఖ మంత్రి లేకుండా పాలన చేసే ముఖ్యమంత్రి ఎక్కడా లేడు. కాంగ్రెస్ పాలనలో కుటుంబ పాలన ఉంది. కాని బీజేపీలో కుటుంబ పాలనకు అవకాశం లేదు. నరేంద్ర మోదీ పాలనకు ప్రజలు పట్టం కడుతున్నారు.

– పవార్ రామారావు పటేల్, ఎమ్మెల్యే ముథోల్

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్‌తో పాటు ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా గుమిగూడడం, ర్యాలీలు నిర్వహించడం చట్టవ్యతిరేకమని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని క్రాంతినగర్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఘటన నేపథ్యంలో టూ టౌన్‌లో ఇరువర్గాలకు సంబంధించి 40 మందిపై నాలుగు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఆదివారం ఆ కాలనీలో పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ.. కొందరు సోషల్ మీడియా ద్వారా ఘటన స్థలానికి రావాలని ప్రచారం చేస్తున్నారని, క్రాంతినగర్‌లో ర్యాలీలు,సభలు, సమావేశాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలెవరు అక్కడికి వెళ్లవద్దని, అక్కడ గుమిగూడితే సీసీ ఫుటేజ్, వీడియోల ఆధారంగా గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వందశాతం పోలింగ్ నమోదు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

తాంసి: ఈనెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని, ఓటింగ్‌ను పండుగలా జరుపుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా కోరారు. భీంపూర్ మండలకేంద్రంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు ఆదివారం అవగాహన కల్పించారు. తొలుత గ్రామస్తులతో కలిసి కలెక్టర్ ఎడ్లబండిపై ర్యాలీగా వెళ్లారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈనెల 13న ఎన్ని పనులున్నా అందరూ ఓటు వేసి వందశాతం పోలింగ్ నమోదు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ సత్యనారాయణరావు, ఏపీఎం ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్, ఆయా గ్రామాల పటేళ్లు దాదారావు, మారుతి, యువజన సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, ఏపీవో సంగీత, ఆర్‌ఐలు అశోక్, శారద, బీఎల్‌వోలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ప్రశాంతంగా నీట్

ఆదిలాబాద్‌టౌన్: మెడికల్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన నీట్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష కొనసాగింది. బయోమెట్రిక్ హాజరు ఉండడంతో విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే కేంద్రంలోనికి అనుమతించారు. చావరా అకాడమి కేంద్రంలో 548 మందికి గాను 15 మంది గైర్హాజరయ్యారు. ఆర్యభట్ట ఇంటర్నేషనల్ స్కూల్ కేంద్రంలో 528 మందికి గాను 14 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఆర్యభట్ట హైస్కూల్‌లో 657 మందికి గాను 638 మంది హాజరయ్యారు. మొత్తం 48 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కోఆర్డినేటర్ శిశిర్ తెలిపారు.



పరీక్ష కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థులు

మాతృభాషలో తడబాటు!

- 'పది' ఫలితాల్లో తెలుగులోనే ఎక్కువ మంది ఫెయిల్
- ఇంగ్లిష్‌లోనూ అదే పరిస్థితి
- సబ్జెక్టు టీచర్ల కొరత, ప్రాథమిక అంశాలపై పట్టు లేకపోవడంతోనే..

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మాతృభాషలోనే తడబడ్డారు. ఎక్కువ మంది ప్రథమ భాషలో ఫెయిల్ అవ్వగా, ఇంగ్లిష్‌లోనూ రాణించలేకపోయారు. దీంతో జిల్లా ఉత్తీర్ణత శాతంపై ప్రభావం చూపింది. గతేడాదితో పోల్చితే రాష్ట్రస్థాయిలో రెండు స్థానాలు ఎగబాకినా 17వ స్థానంలో నిలవడం గమనార్హం.

తెలుగని తేలికగా.. ఇంగ్లిష్ అంటే భయం

జిల్లాలో ఈ ఏడాది రెగ్యులర్ విద్యార్థులు 10,374 మంది పరీక్షలకు హాజరయ్యారు. 92.93 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎక్కువ శాతం మంది విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లోనే ఫెయిల్ అయ్యారు. ఈ సారి తెలుగులో 286 మంది, ఇంగ్లిష్‌లో 261 మంది పరీక్ష తప్పారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతే ప్రధాన కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు తెలుగు సబ్జెక్టుపై పట్టు సాధించకపోవడం, మొదటి పరీక్ష అనే భయం, రీడింగ్ స్కిల్స్ లేకపోవడం, తెలుగు అని తేలికగా తీసుకోవడంతోనే ఎక్కువ మంది ఈ సబ్జెక్టులో ఫెయిల్ అయినట్లు తెలుస్తోంది. జిల్లాలో 45 శాతంకు మించి విద్యార్థులు మాతృభాషలో చదవడం, రాయడం రాకపోవడంతో రాణించలేకపోతున్నారు. అలాగే ప్రాథమిక అంశాలపై పట్టు లేకపోవడం, కొంత మంది ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు సరిగా చెప్పకపోవడం కారణంగా తెలుస్తోంది. ఇంగ్లిష్ విషయానికొస్తే ప్యాసేజ్, ప్యారాగ్రాఫ్ క్వశ్చన్స్ ఎక్కువగా ఉంటాయి. చదివిన అంశాన్ని విద్యార్థులు స్వతహాగా రాయలేకపోతున్నారు. తెలుగు మీడియం వారికి ఎక్కువగా ఇంగ్లిష్ అంటేనే భయం. అలాగే ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధించకపోవడం, ఎక్కువ మంది ఇంగ్లిష్ సబ్జెక్టును కూడా తెలుగులో చెప్పడంతో విద్యార్థులు నేర్చుకోలేకపోతున్నారు. ఇక హిందీలో పది మంది, గణితంలో 144 మంది, సామాన్య శాస్త్రంలో 178 మంది, సాంఘిక శాస్త్రంలో 59 మంది ఫెయిలయ్యారు. ఏటా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నా వాటిని సద్వినియోగం చేసుకోకపోవడం ఫలితాలపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది.



ఉత్తీర్ణత పెంపు కోసమే ఉపాధ్యాయుల దృష్టి

పదో తరగతి పరీక్షలకు సంబంధించి సమావేశాలు నిర్వహించినప్పుడు ఉన్నతాధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించినా ఆచరణలో మాత్రం కానరావడం లేదు. కొంతమంది ఉపాధ్యాయుల ఫలితాలు తగ్గితే పాఠశాల పరువు పోతుందనే ఉద్దేశంతో విద్యార్థులను చూచిరాతకు ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా జిల్లాలో జరుగుతున్న ఈ తీరు అందరికీ తెలిసిందే. ఎక్కువ జీపీఏ రావడంతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారే తప్పా వారిలో విషయ పరిజ్ఞానం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కష్టపడి చదివిన విద్యార్థులు ఈ తీరుతో కొంత నారాజ్ అవుతున్నారు. గతంలో 80 శాతం మించని జిల్లా ఉత్తీర్ణత, గడిచిన మూడునాలుగేళ్లుగా అధికారులు కేవలం ఉత్తీర్ణత శాతంపైనే దృష్టి పెడుతున్నారు. కొంతమంది ఇన్విజిలేటర్లు, సీఎస్, డీవోలకు చూసీచూడనట్లుగా ఉండాలని చెప్పడంతో ఉత్తీర్ణత పెరిగినట్లు తెలుస్తోంది. గడిచిన నాలుగేళ్లలో ఒక్క విద్యార్థి కూడా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డ దాఖలాలు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మూడేళ్లుగా జిల్లా ఉత్తీర్ణత శాతం పరిశీలిస్తే అంకెల్లో మాత్రం పర్వాలేదనిపిస్తోంది. 2021–22లో 95.34 ఉత్తీర్ణత శాతం, 2022–23లో 88.68 శాతం, 2023–24లో 92.93 శాతం సాధించడం గమనార్హం.

క్లుప్తంగా

'బొంతల సీమ బతుకు చిత్రాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరణ చేస్తున్న వక్తలు

బోథ్: సొనాలలోని రామాలయంలో ఆదివారం ప్రముఖ కవి, రచయిత బి.మురళీధర్ రచించిన'బొంతల సీమ బతుకు చిత్రాలు'పుస్తకాన్ని ఆవిష్కరించారు. బోథ్, సోనాల ప్రాంత ప్రజల జీవనశైలిని ప్రతిబింబించే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి అదిలాబాద్, నిర్మల్ నుంచి పలువురు సాహితీవేత్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్ ప్రాంత ముచ్చట్లతో ఈ పుస్తకం ముందు తరాలకు చారిత్రక కావ్యంగా నిలుస్తుందన్నారు. రచయిత మురళీధర్ మాట్లాడుతూ ఈ పుస్తకానికి ప్రేరణ నా చిన్ననాటి బాల్యస్మృతులేనని అన్నారు. ఆ రోజుల్లో వేసవిలో వేసే పందిరిలో పాలేరు మామలు సైతం చెప్పిన కథలే తనకు స్ఫూర్తి అని అన్నారు. తొలి ప్రతి రామాలయ కమిటీ చైర్మన్ జీవీ రమణ రూ.5,116లకు, రెండవ ప్రతి మధుసూదన్ రావు రూ.4,001లకు అందుకున్నారు. రామాలయం కమిటీ చైర్మన్ జీవి రమణ, సుమనస్పతిరెడ్డి, వసంతరావు దేశ్ పాండే, సంపత్‌కుమార్, ఇజి.ఆశన్న, చరణ్‌దాస్, రాజువర్ధన్, ప్రముఖ కవులు, ఓస శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ కోర్సుల 2వ, 6వ సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 6 నుంచి, నాల్గవ సెమిస్టర్ల పరీక్షలు 7 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి ఆదివారం తెలిపారు. 2వ సెమిస్టర్ల పరీక్షలు 6, 8, 10, 16, 18, 21, 25, 29 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 7, 9, 15, 17, 20, 22, 28, 30 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరో సెమిస్టర్ పరీక్షలు 6, 8, 10, 16, 18, 21, 25, 29, 31, జూన్ 7, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయి. రెండో సెమిస్టర్ పరీక్షలకు 68,139, నాలుగో సెమిస్టర్‌కు 56,899, ఆరో సెమిస్టర్‌కు 46,077 మొత్తం 1,71,115 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు ఉమ్మడి వరంగల్‌లో 44, ఉమ్మడి ఖమ్మంలో 30, ఉమ్మడి ఆదిలాబాద్‌లో 49 మొత్తం 123 సెంటర్లు ఏర్పాటు చేసి 123 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. ఒక్కో సెంటర్‌కు ఒక అబ్జర్వర్, వర్సిటీ పరిధిలో పది ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. హాల్ టికెట్లు కళాశాలల వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని, కళాశాలల నుంచి పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంలో జొన్న దగ్ధం



కాలిపోయిన జొన్న

తాంసి: తాంసి శివారులో ఆదివారం జొన్న పంట అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రైతు బెల్లపు అశోక్ నాలుగెకరాలు కౌలు తీసుకుని జొన్న సాగుచేశాడు. పక్కనున్న చేలలో రైతులు వ్యర్థాలకు పెట్టిన నిప్పు మంటలు జొన్నకు అంటుకుంది. మధ్యాహ్న సమయంలో రెండెకరాల్లో పంట పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

నర్సింహరెడ్డిదే అధిక మెజార్టీ


- అత్యధికం 1,81,955 అత్యల్పం 5,912
- ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థుల మెజార్టీ తీరు
- ఏడవ లోక్‌సభ ఎన్నికల్లో నమోదు



కందుల ఆశన్న



గడ్డం నర్సింహారెడ్డి





కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజ కవర్గానికి ఒక ఉప ఎన్నికతో కలిపి ఇప్పటివరకు 18 సార్లు ఎన్నికలు జరిగాయి. 12 మంది ఎంపీలుగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. తమ పని తీరుతో ప్రజలను ఆకట్టుకుని పలుమార్లు విజయం సాధించారు. అయితే 1980లో జరిగిన ఏడవ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్(ఐ) పార్టీ అభ్యర్థి జి.నర్సింహరెడ్డి సాధించిన మెజార్టీయే అత్యధికం. కాగా ఇప్పటివరకు ఇదే రికార్డుగా ఉంది. ఆ ఎన్నికల్లో నర్సింహరెడ్డికి 2,34,300 ఓట్లు రాగా, జేఎస్పీ అభ్యర్థి పి.రాజేశ్వర్‌రావు 52,345 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో ఆయనపై 1,81,955 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి రికార్డు సృష్టించారు.

- ఇక అత్యల్ప మెజార్టీ 1957లో జరిగిన రెండో లోక్‌సభ ఎన్నికల్లో నమోదైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కందుల ఆశన్న 91,287 ఓట్లు రాగా, పబ్లిక్ సోషలిస్టు పార్టీ అభ్యర్థి సి.మాధవరెడ్డికి 85,375 ఓట్లు వచ్చాయి. దీంతో ఆశన్న 5,912 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఇదే అత్యల్ప మెజార్టీగా నమోదైంది. ఇక ఎన్నికలవారీగా నమోదైన మెజార్టీలను పరిశీలిస్తే ఇలా ఉన్నాయి.
- 1952లో జరిగిన తొలి ఎన్నికలో సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి చెరుకు మాధవ్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి జేవీ నర్సింగ్‌రావుపై 25,083 ఓట్ల అధిక్యంతో గెలుపొందారు. మాధవరెడ్డికి 90,995 ఓట్లు రాగా, నర్సింగ్‌రావుకు 65912 ఓట్లు పోలయ్యాయి.
- 1962 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జి.నారాయణరెడ్డికి 1,29,068 ఓట్లు రాగా, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసిన విజి. దొరసామి 39,983 ఓట్లు వచ్చాయి. 89,085 ఓట్ల అధిక్యంతో నారాయణరెడ్డి విజయం సాధించారు.
- 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పి.గంగారెడ్డికి 1,60,494 ఓట్లు రాగా, సీపీఐ అభ్యర్థి డీ ఎస్ రావుకు 86,244 ఓట్లు వచ్చాయి. దీంతో 74,250 ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించారు. అలాగే 1971లో జరిగిన ఎన్నికల్లో ఆయనకు 1,51,482 ఓట్లు రాగా టీపీఎస్ అభ్యర్థి కేవీ.కిషన్‌రావుకు 1,36, 532 ఓట్లు వచ్చాయి. 14,950 ఓట్ల అధిక్యంతో మరోసారి ఎంపీగా గెలుపొందారు.
- 1977లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపు న పోటీచేసిన జి.నర్సింహరెడ్డికి 1,67,410 ఓట్లు రాగా, బీఎల్‌డీ అభ్యర్థి గోపిడి గంగారెడ్డి 96,244 ఓట్లు వచ్చాయి. దీంతో 71,166 ఓట్ల అధిక్యంతో ఆయన ఎంపీగా ఎన్నికయ్యారు.
- 1984లో టీడీపీ అభ్యర్థి సి.మాధవరెడ్డికి 2,38,440 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నర్సింహరెడ్డికి 1,83,882 ఓట్లు వచ్చాయి. 54,558 ఓట్ల అధిక్యంతో మాధవరెడ్డి ఎంపీగా ఎన్నికయ్యారు.
- 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పి.నర్సారెడ్డి చేతిలో 44,365 ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి సి.మాధవరెడ్డి పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికల్లో నర్సారెడ్డికి 2,90,072 ఓట్లు రాగా, సి.మాధవరెడ్డికి 2,45,707 ఓట్లు వచ్చాయి.
- 1996లో జరిగిన ఎన్నికల్లో ఎస్. వేణుగోపాలాచారి 2,86,477 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి 1,49,117, ఓట్లు వచ్చాయి. దీంతో 1,37,360 ఓట్ల అధిక్యంతో చారి విజయం సాధించారు. 1998లో జరిగిన ఎన్నికల్లో చారికి 2,91,168 ఓట్లు రాగా, ఐకే రెడ్డికి 2,57,634 ఓట్లు వచ్చాయి. దీంతో మరోసారి చారి 33,534 ఓట్ల అధిక్యంతో రెండోసారి ఎంపీగా గెలిచారు. 1999లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ సుల్తాన్ అహ్మద్‌పై టీడీపీ అభ్యర్థి చారి 1,10,023 ఓట్ల అధిక్యంతో మూడోసారి విజయం సాధించారు. టీడీపీకి 3,90,308 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీకి 2,80,585 ఓట్లు వచ్చాయి.
- 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేణుగోపాలాచారిపై టీఆర్‌ఎస్ అభ్యర్థి మధుసూదన్ రెడ్డి 40,974 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు 4,15,429 ఓట్లు రాగా, టీడీపీకి 3,74,455 ఓట్లు పోలయ్యాయి.
- రెండుసార్లు టీడీపీ అభ్యర్థి వేణుగోపాలాచారి చేతిలో ఓటమి పాలైన ఇంద్రకరణ్‌రెడ్డి 2008లో జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ తరపున పోటీచేసి చారిని ఓడించారు. ఈ ఎన్నికల్లో అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి 3,23,109 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి వేణుగోపాలా చారికి 2,67,139 ఓట్లు వచ్చాయి. దీంతో ఇంద్రకరణ్‌రెడ్డి 55,970 ఓట్ల అధిక్యంతో టీడీపీపై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి 1,44,455 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు.
- 2009లో కాంగ్రెస్ అభ్యర్థి కొట్నాక్ రమేశ్‌పై టీడీపీ అభ్యర్థి రమేశ్ రాథోడ్ 1,15,087 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి 3,72,268 ఓట్లు పోలవ్వగా, కాంగ్రెస్‌కు 257181 ఓట్లు వచ్చాయి.
- 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గోడం నగేశ్ కాంగ్రెస్ అభ్యర్థి నరేశ్ జాదవ్‌పై 1,71,290 ఓట్ల అధిక్యంతో గెలుపొందారు. నగేశ్‌కు 4,30,847 ఓట్లు రాగా, నరేశ్‌జాదవ్‌కు 2,59,557 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి రమేశ్ రాథోడ్ 1,84,198 ఓట్లతో మూడోస్థానానికి పరిమితమయ్యారు.
- 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు బీఆర్‌ఎస్ అభ్యర్థి గోడం నగేశ్‌పై 58,560 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు.ఎన్నికల్లో బీజేపీకి 3,77,374 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 3,18,814 ఓట్లు పోలయ్యాయి.

సామూహిక వివాహాలు ఆదర్శనీయం



సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న అంద్ ఆదివాసీ పెద్దలు

- దస్నాపూర్‌లో ఒక్కటైన 11 జంటలు
- వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: సంత్ సద్గురు పూలాజీబాబా అడుగుజాడలో నడుస్తూ అంద్ ఆదివాసీలు సామూహిక వివాహాలు చేపట్టడం ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని దస్నాపూర్ గ్రామంలో గల సంత్ సద్గురు పూలాజీబాబా ధ్యాన్ కేంద్రంలో ఆదివారం సామూహిక వివాహ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అంద్ ఆదివాసీ సేవాసంఘం, గ్రామ సామూహిక వివాహ వేడుక నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 11 నూతన జంటలు ఏకమయ్యాయి. మంత్రి సీతక్కతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఎంపీపీ శోభాబాయి, జెడ్పీటీసీ పుష్పలత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. సామూహిక వివాహాల ద్వారా నిరుపేదల పెళ్లిళ్ల ఖర్చు తగ్గడంతో పాటు గ్రామంలో ఐక్యత పెరుగుతుందన్నారు. నిర్వాహకులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో దస్నాపూర్ గ్రామ పటేల్ కోటుడే పుండలిక్, అంద్ ఆదివాసీ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖడే విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, అంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలు వామన్‌రావ్, రాందాస్, దశరథ్, పాండురంగ్, ముఖడే ఉత్తం, సాయినాథ్, కేశవ్, ఆయా పార్టీల నాయకులు, బంధువులున్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి సీతక్క



హాజరైన బంధువులు

వ్యక్తి అస్థిపంజరం లభ్యం

- తాంసి(కె) అటవీ ప్రాంతంలో..
- నిపాని వాసి భూమన్నగా గుర్తింపు



భూమన్న (ఫైల్)



అటవీ ప్రాంతంలో అస్థిపంజరం

తాంసి: భీంపూర్ మండలం తాంసి(కె) శివారు పిప్పల్ కోటి రిజర్వాయర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం వ్యక్తి అస్థిపంజరాన్ని గుర్తించారు. అటవీ ప్రాంతంలో దీన్ని చూసిన మేకల కాపరి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రదీప్‌కుమార్ సిబ్బందితో ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కుక్కలు, అడవి జంతువులు పీక్కుతిన్నాయి. కేవలం అస్థిపంజరం, ముఖ భాగం ఉండడంతో ఆనవాళ్లు తెలిసేలా చేసింది. అస్థిపంజరం పక్కన దీక్షమాలతోపాటు పురుగుల మందు డబ్బా పడి ఉంది. మృతదేహం నిపాని గ్రామానికి చెందిన పూదరి భూమన్న (40)గా పోలీసులు గుర్తించి కుటుంబీకులకు తెలియజేశారు. భూమన్న వారం క్రితం హనుమాన్ మాలధరించి అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. అటవీ ప్రాంతంలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. తల్లి గంగమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీని ఢీకొన్న ఆటో

తాంసి: మండలంలోని పొన్నారి శివారులో అంతర్రాష్ట్ర రహదారిపై శనివారం అర్ధరాత్రి లారీని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలు, మరో ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై శివరాం కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ కరణ్‌చౌహాన్ ఇద్దరు ప్రయాణికులతో పొన్నారి నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్నాడు. హనుమాన్ ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో దెబ్బతింది. కరణ్‌చౌహాన్ ఆటో క్యాబిన్‌లో ఇరుక్కుని కాలు విరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముక్తార్, సయ్యద్ హన్సారీలకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు ఆటోలో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి, గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆటోడ్రైవర్ తల్లి బేబీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



జైనథ్: మండలంలోని గిమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సభాధ్యక్షులు జ్యోతి, గౌరవ అధ్యక్షుడు మూర్తి, పూర్వవిద్యార్థులు శ్రావణ్‌కుమార్, నవీన్, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అబుదాబిలో చింతల్‌చాంద వాసి మృతి

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద వాసి నాన్ రాజన్న(51) అబుదాబిలో మృతిచెందాడు. గత 20 ఏళ్ల నుంచి బతుకుదెరువు కోసం అబుదాబి వెళ్లి కూలీగా పనిచేస్తున్నారు. స్వగ్రామానికి వస్తూ వెళ్తుండేవాడు. అబుదాబిలో పనిచేసే ప్రదేశంలో గతనెల 30న రాజన్నకు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయాన్ని మిత్రులు ఫోన్ ద్వారా ఆదివారం కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని భార్య గంగవ్వ, ఇద్దరు కుమారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్‌కు చెందిన వృద్ధురాలు లక్ష్మి అలియాస్ గంగమ్మ (75) వడదెబ్బతో మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాలు..బీడీ కార్మికురాలైన ఆమె ఎండతీవ్రత కారణంగా రెండు రోజులుగా నిరసించిపోయింది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో అకస్మాత్తుగా కిందపడి పరిస్థితి విషమించి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త గతంలో మృతిచెందగా, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తాంసి: కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన భీంపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుం. ఎస్సై ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం..భీంపూర్‌కు చెందిన రాథోడ్ నేహన్ (20) ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎస్సై పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాథోడ్ దిలీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముత్నూర్‌లో..

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన సాయి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తీర్మల్‌వార్ దిలీప్, అనిత దంపతులకు అక్షయ్, సాయి(24) సంతానం. సాయి.. ఉట్నూర్‌లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. స్వగ్రామం ముత్నూర్‌లో తమ బంధువుల మీసేవ కేంద్రంలో పనిచేస్తున్నాడు. గత ఐదేళ్ల నుంచి సాయి ఆస్తమా వ్యాధితో బాధపడుతున్నారు. కుటుంబీకులు పలు ఆస్పత్రులకు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న సాయిని కుటుంబీకులు ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఏఎస్సై లక్ష్మణ్ మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఓటు వినియోగంపై వినూత్న అవగాహన



ఓటు ఆకారంలో కూర్చున్న చిన్నారులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూచిపూడి నృత్య శిక్షణ పొందుతున్న చిన్నారులు ఓటు హక్కు వినియోగంపై ఆదివారం వినూత్నరీతిలో అవగాహన కల్పించారు. స్థానిక శ్రీరామచంద్రా గోపాలకృష్ణమఠం ఆవరణలోని శిక్షణ శిబిరంలో శిక్షకురాలు గంధ్రత్ అవంతిక ఆధ్వర్యంలో చిన్నారులు ఓటు (వీఓటీఈ) ఆకారంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా అవంతిక మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ రోజైన మే 13న ఇంట్లో ఉన్న ప్రతి చిన్నారి తమ కుటుంబ సభ్యులను ఓటువేసేలా చూడాలని కోరారు. అందరితో ఓటు వేయించి, అనంతరం కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో పోస్ట్‌చేసేలా చూడాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఉదయం పూటనే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పిల్ల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతివనం కంచె అపహరణ

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి పంచాయతీలోని పల్లెప్రకృతివనం కంచెను ఆదివారం గుర్తు తెలియని దొంగలు అపహరించారు. లక్ష రూపాయలు విలువచేసే ఫెన్సింగ్‌తో పాటు నాలుగు సిమెంటు పోల్స్ ఎత్తుకెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఎంపీవో శ్రీనివాస్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లడిల్లిన తల్లి గుండె



తాంసి: పెంపుడు జంతువులు తమ పిల్లలపై చూపే ప్రేమానురాగాలు మాటల్లో చెప్పలేనివి. వాటికి ఏమైనా హాని జరిగితే తట్టుకోలేవు. ఆదివారం భీంపూర్ మండలం లక్ష్మీపూర్ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై వాహనం ఢీకొని కుక్కపిల్ల మృతిచెందింది. తల్లి శునకం గంటకు పైగా అక్కడే ఉంది. కుక్కపిల్ల బతికే ఉందనుకొని తలపై నిమురుతూ లేపే ప్రయత్నం చేసింది. రోడ్డుపై వాహనాలు వస్తున్న లెక్కచేయకుండా తల్లి శునకం కళేబరం వద్ద అలాగే చూస్తూ ఉండటం పలువురిని కలిచివేసింది.